


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 21-08-2025 | సంపుటి - 24 | సంచిక - 105 | రూ : 4 | పేజీలు: 8


# తెలుగు రాష్ట్రాలకు బుల్లెట్ రైళ్లు!

- రైల్వేబోర్డుకు చేరిన హైదరాబాద్-ముంబయి డీపీఆర్
- హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు ఎలైన్‌మెంట్లపై కసరత్తు
- 3 గంటల్లో ఆయా నగరాలకు చేరుకునేలా లైన్ల నిర్మాణం



హైదరాబాద్ నుంచి పొరుగు రాష్ట్రాల్లోని మెట్రో నగరాలకు బుల్లెట్ రైలు సదుపాయం కల్పించే కార్యాచరణ వేగవంతమవుతోంది. ఇప్పటికే సిద్ధమైన హైదరాబాద్‌ముంబయి హైస్పీడ్ మార్గం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రైల్వే బోర్డుకు చేరింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగుళూరులకు వేర్వేరుగా రెండు హైస్పీడ్ రైలు కారిడార్ల తుది సర్వే ఎలైన్‌మెంట్‌కు కసరత్తు జరుగుతోంది. బుల్లెట్ రైలు మార్గాల్ని గంటకు గరిష్ఠంగా 350 కి.మీ, సగటున 250 కి.మీ వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారు.

### * మూడు వైపులా మొత్తం 580 కి.మీ!

హైదరాబాద్‌ముంబయి హైస్పీడ్ కారిడార్ డీపీఆర్‌లో మొత్తం 11 స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ మార్గం రాష్ట్రంలో సుమారు 170 కి.మీ పరిధిలో ఉంటుంది. రెండు (హైదరాబాద్, జహీరాబాద్) స్టేషన్లు ఉన్నాయి. కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్ ఆమోదించిన తర్వాత భూసేకరణ, నిధుల మంజూరు వంటి ప్రక్రియలు మొదలవుతాయి. చెన్నై, బెంగళూరు మార్గాలను కలిపితే రాష్ట్రంలో హైస్పీడ్ కారిడార్ దూరం 580 కి.మీ.గా ఉంటుంది.

### దగ్గరి మార్గాలపై చర్చలు

హైదరాబాద్ వయా చెన్నై, బెంగళూరు హైస్పీడ్ కారిడార్ తుది సర్వే పనులు చేపట్టిన రైల్వే అనుబంధ 'రైట్స్' సంస్థ ప్రాథమికంగా ఎలైన్‌మెంట్లు రూపొందించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు సేకరించిన అనంతరం ఖరారు చేస్తారు. ఈ మేరకు సర్వే సంస్థ అధికారులు కొద్ది రోజుల క్రితం తెలంగాణ ఉన్నతాధికారులతో సమావేశమై ఆయా ప్రతిపాదనలపై చర్చించారు. హైదరాబాద్

తరువాయి 2లో



2లో

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర ఉంది!

## : సీఎం రేవంత్‌రెడ్డి

- 1994 నుండి 2014 వరకు నాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని వ్యాఖ్య
- హైటెక్ సిటీని కట్టినప్పుడు అవహేళన చేశారని వ్యాఖ్య
- ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారని విమర్శ



## కాళేశ్వరం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తోన్న గోదావరి

- కాళేశ్వరం వద్ద 12.41 మీటర్లకు చేరుకున్న నీటిమట్టం
- కొంతమేర నీట మునిగిన పుష్కర్ ఘాట్ మెట్ల వద్ద జ్ఞానదీపాలు
- పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద నీటి మట్టం 12.41 మీటర్లకు చేరడంతో పుష్కర ఘాట్ మెట్ల వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానదీపాలు కొంతమేరకు నీటిలో మునిగాయి. త్రివేణి సంగమం వద్ద వరద ప్రవాహం అధికంగా ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మెదక్ జిల్లాలోని పుణ్యక్షేత్రం

తరువాయి 2లో



2లో

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అదిరిపోయే ఆరంభం..

### గిన్నిస్ బుక్‌లోకెక్కిన ఆంధ్రప్రదేశ్



2లో

## లోక్‌సభలో 'ఆన్‌లైన్ గేమింగ్' రగడ..

### ప్రతిపక్షాల ఆందోళనతో దద్దరిల్లిన సభ!

- లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం
- సరిహద్దులు దాటి, విదేశాల నుంచి ఆడే మనీ గేమ్‌లపై పూర్తి నిషేధానికి ప్రతిపాదన
- బిల్లు ప్రవేశపెట్టగానే తీవ్ర గందరగోళం సృష్టించిన ప్రతిపక్షాలు
- ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అసంతృప్తి
- యువతను, ఆర్థిక వ్యవస్థను కాపాడటమే బిల్లు ముఖ్య ఉద్దేశం



ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తామంటే..

## స్పష్టం చేసిన కేటీఆర్

2లో

## అభివృద్ధిని అడ్డుకునేవాళ్లు రాష్ట్రానికి శత్రువులే: సీఎం

- ప్రపంచ వేదికగా ఫ్యూచర్‌సిటీ రూపుదిద్దాలి
- మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం దుర్మార్గం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో



2లో

## తెలంగాణలో ముగుస్తున్న వైన్ షాపుల లైసెన్సులు..

# ప్రభుత్వం కీలక నిర్ణయం

## అగ్ని-5 బాలిస్టిక్ మిస్సైల్ ను విజయవంతంగా పరీక్షించిన భారత్

- ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రయోగం
- 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సత్తా
- అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం
- కచ్చితత్వంతో లక్ష్యాన్ని తాకినట్లు తెలిపిన అధికారులు
- రక్షణ రంగంలో భారత్ మరో కీలక ముందడుగు

2లో



# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అదిరిపోయే ఆరంభం.. గిన్నిస్ బుక్‌లోకెక్కిన ఆంధ్రప్రదేశ్

* **రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం రోజే ఏపీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు**
* **కేవలం 24 గంటల్లో 1,67,321 స్టార్టప్‌ల రిజిస్ట్రేషన్‌తో సరికొత్త చరిత్ర**
* **సీఎం చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ చేతుల మీదుగా హబ్ ప్రారంభం**
* **అమరావతితో పాటు మరో నాలుగు నగరాల్లో ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు**
* **ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్న సీఎం**
* **ఆవిష్కరణల కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం**

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్ర ప్రదేశ్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలో యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్టీఐహెచ్) ప్రారంభోత్సవం రోజే అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. కేవలం 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 1,67,321 ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌లు రిజిస్టర్ కావడం ద్వారా ఈ అసాధారణ ఘనత సాధ్యమైంది. ఈ రికార్డును గుర్తిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారిక ధృవపత్రాన్ని అందజేశారు. ఈ అద్భుతమైన ఆరంభం, రాష్ట్రంలో స్టార్టప్‌ల పట్ల యువతలో ఉన్న ఆసక్తికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది. బుధవారం నాడు మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ హబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. "రతన్ టాటా గారి నిరాడంబరత, దేశానికి ఆయన చేసిన సేవ అందరికీ ఆదర్శం. ఆయన ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశంతో, 'గివ్ బ్యాక్ టు ది సొసైటీ' అనే ఆయన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇన్నోవేషన్ హబ్‌కు శ్రీకారం చుట్టాం" అని చంద్రబాబు వివరించారు. ఈ హబ్ ద్వారా యువతలోని వినూత్న ఆలోచనలను గుర్తించి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

* **రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ.. ఇంటికో పారిశ్రామికవేత్తే లక్ష్యం**

ఈ ఇన్నోవేషన్ కేంద్రాలను కేవలం అమరావతికే పరిమితం చేయకుండా 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు సీఎం తెలిపారు. అమరావతి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుండగా, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో అనుబంధ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్య సాధనలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. సరైన ప్రభుత్వ విధానాలతో సంపద సృష్టించడం ద్వారానే సంక్షేమం సాధ్యమవుతుందని, గతంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించిన తరహాలోనే ఇప్పుడు స్టార్టప్‌లకు ఊతమిస్తున్నామని అన్నారు.

* **టెక్నాలజీతో అభివృద్ధి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ**

టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న వాదనను తాను నమ్మనని, టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలున్నాయని యువతకు సూచించారు. "అమరావతి నగరాన్ని క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తేబోతున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. ఒకవైపు సంపద సృష్టిస్తూ, మరోవైపు 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై పోరాటం) ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని, 'వెల్త్, హెల్త్, హ్యాపీ సొసైటీ'గా ఏపీని మారుస్తామని పునరుద్ఘాటించారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో అతి తక్కువ సమయంలోనే ఇన్నోవేషన్ హబ్‌కు రూపమిచ్చారని ప్రశంసించారు. స్టార్టప్‌లకు ఇదొక అద్భుతమైన అవకాశమని, ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు అనేక రంగాల్లో వినూత్న పరిష్కారాలు కనుగొనేందుకు ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టార్టప్ కంపెనీల స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించి, వారి ఉత్పత్తులను పరిశీలించారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తామంటే.. స్పష్టం చేసిన కేటీఆర్

**హైదరాబాద్ :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము ఎవరికి మద్దతు ఇస్తామో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సెప్టెంబర్ 9 లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తారో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో రెండు నెలలుగా దయనీయమైన పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనం వల్ల ఇలాంటి పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఎరువుల బస్తాల కోసం రైతులు ఎన్నో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి రాలేదని గుర్తు చేశారు. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి సమీక్ష చేయలేదని అన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖతో ఇతర శాఖలకు సమన్వయం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నిర్వాకం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఒక రైతు 3 బస్తాల యూరియా తీసుకుంటే నాన్‌బెయిలబుల్ కేసు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీకి 51 సార్లు వెళ్లిన

## హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర ఉంది!

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డిల పాత్ర ఎంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 1994 నుండి 2014 వరకు హైదరాబాద్ నగరాన్ని ఆనాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని ఆయన అన్నారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైటెక్ సిటీని నిర్మిస్తున్న సమయంలో చాలామంది అవహేళన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యో నగరాలతో పోటీ పడుతోందని తెలిపారు. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం చాలా అవసరమని అన్నారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థల్లో తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ చొరవతోనే ఐటీ రంగంలో చాలామంది రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాలో మన ఐటీ నిపుణులు పనిచేయడం ఆపేస్తే ఆ దేశం స్తంభించిపోతుందని అన్నారు. మన ప్రాంతం విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని నాటి ముఖ్యమంత్రులు పలు విద్యాసంస్థలను నిర్మించారని తెలిపారు. ఇప్పుడు మనం హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడుతుంటే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారిని ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మూసీ నది ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని ఆయన అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మూసీ నది ప్రక్షాళనతో పాత నగరానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. నగర అభివృద్ధికి అడ్డుపడేవారు ఎవరైనా మనకు శత్రువులేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలతో కూడిన ఉద్యోగ భద్రతను

## కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తోన్న గోదావరి... నీట మునిగిన జ్ఞానదీపాలు

**(మొదటిపేజీ తరువాయి)**

ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం వారం రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. సింగూరు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు నక్క వాగు ప్రవాహంతో వనదుర్గ ఆనకట్టకు భారీగా వరద పోటెత్తుతోంది. వనదుర్గ ఆనకట్ట మీదుగా 50,985 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట, గర్భగుడికి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

## లోక్‌సభలో 'ఆన్‌లైన్ గేమింగ్' రగడ..

**ఢిల్లీ, ఆగష్టు 20 :** లోక్‌సభ బుధవారం తీవ్ర గందరగోళం మధ్య ప్రారంభమైంది. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుపై రగడ చెలరేగింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్, నియంత్రణ బిల్లు 2025'ను సభలో ప్రవేశపెట్టగానే ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసనలకు దిగారు. వారి ఆందోళనలతో సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

**ప్రతిపక్షాల తీరుపై మంత్రి రిజిజు ఆగ్రహం**

సభలో ప్రతిపక్షాల తీరుపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యుల ప్రవర్తనను చూసి పాఠశాల పిల్లలు కూడా ప్రశ్నించే పరిస్థితి ఏర్పడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. "అంతరిక్ష రంగంలో మనం సాధించిన విజయాలపై చర్చించేందుకు కూడా వారు అనుమతించడం లేదు. ప్రజలంతా గమనిస్తున్నారు" అంటూ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

**బిల్లులోని ముఖ్యాంశాలు ఏమిటంటే..?**

ఈ స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమింగ్‌తో సహా మొత్తం ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చి నియంత్రించేందుకు ఈ బిల్లును రూపొందించారు. దీని కోసం జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి లేదా విదేశాల నుంచి నిర్వహించే డబ్బుతో కూడిన ఆన్‌లైన్ గేమ్‌లను పూర్తిగా నిషేధించాలని ఈ బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల యువత వ్యసనాలకు బానిస కావడం, మోసాలు, వ్యక్తిగత డేటా ఉల్లంఘనలు వంటి సమస్యలను అరికట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక వ్యవస్థ, జాతీయ సార్వభౌమత్వ పరిరక్షణ కూడా ఈ బిల్లు ఉద్దేశాలలో ఒకటి.

## అగ్ని5 బాలిస్టిక్ మిస్సైల్ ను విజయవంతంగా పరీక్షించిన భారత్

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సామర్థ్యం గల అగ్ని5 బాలిస్టిక్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి సాయంత్రం 7:30 గంటల సమయంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించి తన సత్తాను చాటింది. సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగల సామర్థ్యం అగ్ని5 సొంతం. ఈ ప్రయోగ సమయంలో క్షిపణి పనితీరు, వేగం, ట్రాకింగ్ వ్యవస్థలు వంటి అన్ని సాంకేతిక అంశాలను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పర్యవేక్షించారు. అనుకున్న విధంగానే క్షిపణి అన్ని ప్రమాణాలను విజయవంతంగా అందుకుందని అధికారులు



ధ్రువీకరించారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, సైనిక ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ పరీక్ష సజావుగా సాగింది. భారత రక్షణ వ్యవస్థలో అగ్ని 5 క్షిపణి అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అయిన ఇది, అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో దేశ రక్షణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ఈ విజయవంతమైన పరీక్షతో రక్షణ సాంకేతికతలో స్వావలంబన దిశగా భారత్ మరో బలమైన అడుగు వేసినట్లయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా విజయంపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల బృందాన్ని పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

## తెలంగాణలో ముగుస్తున్న వైన్ షాపుల లైసెన్సులు.. ప్రభుత్వం కీలక నిర్ణయం

* **తెలంగాణలో మద్యం దుకాణాలపై ప్రభుత్వ కీలక నిర్ణయం**
* **నవంబర్ 30తో ముగియనున్న ప్రస్తుత లైసెన్సుల గడువు**
* **జనాభా ప్రాతిపదికన కొత్త లైసెన్స్ ఫీజుల ఖరారు**
* **రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తింపు**
* **గరిష్ఠంగా రూ. 1.10 కోట్లు, కనిష్ఠంగా రూ. 50 లక్షలుగా ఫీజు**

**హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్సులకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వైన్ షాపులకు జనాభాను ప్రామాణికంగా తీసుకుని కొత్త లైసెన్స్ ఫీజులను ఖరారు చేసింది. ప్రస్తుత లైసెన్సుల గడువు ఈ ఏడాది నవంబర్ 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుల ఫీజును రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు రెండేళ్ల కోసం లైసెన్సులు జారీ చేయనున్నట్లు పేర్కొంది. మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు కూడా కల్పించింది. గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు వర్తించే ఈ కొత్త విధానం ప్రకారం, జనాభాను బట్టి ఫీజులను పలు స్లాబులుగా విభజించారు.

* **అబ్కారీ శాఖ నిర్ణయించిన వివరాల ప్రకారం**

* 5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజును రూ. 50 లక్షలుగా నిర్ణయించారు.
* 5 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ. 55 లక్షలు చెల్లించాలి.
* 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న చోట ఫీజు రూ. 60 లక్షలుగా ఉంది.
* లక్ష నుంచి 5 లక్షల జనాభా వరకు రూ. 65 లక్షలు ఖరారు చేశారు.
* 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.
* 20 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలు, పట్టణాల్లో అత్యధికంగా రూ. 1 కోటి 10 లక్షల లైసెన్స్ ఫీజును నిర్ణయించారు.

ప్రస్తుత లైసెన్సుల గడువు ముగియనుండటంతో, రాబోయే విడతకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కోసం అబ్కారీ శాఖ ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించింది.

## తెలుగు రాష్ట్రాలకు బుల్లెట్ రైళ్లు!

నుంచి చెన్నైకి.. కాజీపేట, నల్గొండ మీదుగా రెండు పాత రైల్వే మార్గాలున్నాయి. హైదరాబాద్ విజయవాడ మధ్య జాతీయ రహదారి 65 కూడా ఉంది. ఈ మూడు మార్గాలపై ప్రాథమికంగా చర్చించినట్టు, కాజీపేట మీదుగా అయితే దూరం ఎక్కువ అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. జాతీయ రహదారి వెంట గానీ, నల్గొండ మీదుగా గానీ రెండు మార్గాలను పరిశీలించి.. ఒకదాన్ని ఎంపిక చేసే అవకాశాలున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో కలిసినప్పుడు హైస్పీడ్ కారిడార్ల అంశం చర్చకు వచ్చినట్లు, ముంబయిఅహ్మదాబాద్ ప్రాజెక్టు పూర్తయ్యాక హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు ప్రాజెక్టులు చేపడతామని కేంద్రమంత్రి పేర్కొన్నట్లు తెలిసింది.

**కొత్త మార్గంలో నిర్మాణం**

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరులకు రైలు ప్రయాణ సమయం 1213 గంటలుగా ఉంది. ఆయా నగరాలను మూడు గంటల్లో చేరుకునే లక్ష్యంతో బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్ని డిజైన్ చేస్తున్నారు. 'హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్‌ను పాత వాటితో సంబంధం లేకుండా పూర్తిగా కొత్త మార్గంలో గ్రీన్‌ఫీల్డ్ నమూనాలో నిర్మిస్తారు. అందులో కేవలం బుల్లెట్ రైళ్లే నడుస్తాయి. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాలిస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, చెన్నై, బెంగళూరుతో పాటు కర్నూలు, విజయవాడ, గుంటూరు నగరాలకు చేరుకోవడం మరింత సులభం అవుతుంది. వ్యాపారం, విద్య, ఐటీ రంగాల విస్తరణకు ఈ మార్గాలు దోహదం చేస్తాయి' అని రైల్వే వర్గాలు తెలిపాయి.

## అభివృద్ధిని అడ్డుకునేవాళ్లు రాష్ట్రానికి శత్రువులే

హైదరాబాద్: రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగించే వారికి అడ్డుకట్టవేయాల్సిన బాధ్యతను ప్రజలే తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారు రాష్ట్రానికి శత్రువులేనన్నారు. 2034 నాటికి ప్రపంచమంతా హైదరాబాద్‌ను చూడటానికి వచ్చేలా నగరాన్ని తీర్చిదిద్దాలని, ఫ్యూచర్ సిటీ విశ్వ వేదిక కావాలని ఆకాంక్షించారు. న్యూయార్క్, సింగపూర్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడటమే తమ లక్ష్యమన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ (తాలిం)లో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయాలకు సీఎం శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది జూన్ 2వతేదీ నాటికి కార్యాలయాల నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..సబర్మతి, యమున, గంగా నదులను ప్రక్షాళన చేస్తున్నప్పుడు, హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచే మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుపడుతున్నారని విపక్షాలను ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొందరికి ఇష్టం లేదని, అందుకే అడ్డుపడుతున్నారని ఆక్షేపించారు. ఓల్డ్ సిటీ అంటేనే ఒరిజినల్ సిటీ అని, దాన్ని గోల్డ్ సిటీగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో పోలీసు సేవలుండాలి

* ప్రజా ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలి
* గణేష్ ఉత్సవాల్లో నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు
* జిల్లా ఎస్పీ మహేష్ బి గితే
* ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు






ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో పోలీసు సేవలుండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. బుధవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ వారు రూపొందించిన https://policeportal.tspolice.gov.in/ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గణేష్ చవితి సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజే యాజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, అవసరం అయితే బైండోవర్ చేయాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్ధంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని, ప్రజలు కూడా వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.అంతకుముందు గంబీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య వరద ప్రవాహం ఎక్కువ ఉండి రాకపోకలకు ఇబ్బంది తలెత్తగా స్థానిక ఎస్ఐ రమాకాంత్‌తో కలిసి పరిశీలించి, అటు వైపు ఎవరు పోకుండా ఇరువైపులా బారికేడ్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అవసరం మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఓయూ 84 వ స్నాతకోత్సవంలో పట్టా పొందిన డాక్టర్ రుక్సానా మొహమ్మద్

యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఈ నెల 19 వ తేదీన జరిగిన 84 వ స్నాతకోత్సవంలో నర్సంపేట పట్టణం కి చెందిన డాక్టర్ రుక్సానా మొహమ్మద్ వాణిజ్య శాస్త్ర విభాగం లో పీఎచ్డీ అవార్డు రాష్ట్ర గవర్నర్ ఓయు కులపతి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ, భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం చైర్మన్ డాక్టర్ నారాయణన్ , ఓయు ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదగా అందుకున్నారు. డాక్టర్ రుక్సానా మొహమ్మద్ చిన్ననాటి నుండి చదువుల్లో అనేక అవార్డులు రివార్డులు అందుకుని తనలాంటి విద్యార్థులకు మార్గదర్శనం చేయాలనే లక్ష్యంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా 2013 లో ఎంపికై ప్రస్తుతం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె అత్యున్నతమైన విద్యను అభ్యసించి విశ్వ విద్యాలయ స్థాయిలో మంచి గుర్తింపు పొందటం పట్ల నర్సమాపేట పట్టణంలోని పలువురు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మట్టి దెబ్బలు, గడ్డి చెట్లు తొలగించాలి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ లో గల నియర్ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో గల ఇంట్లోకి పాములు పాకుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పలు మార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని స్థానికులు వాపోయారు. ఫిర్యాదు చేసినా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇకనైనా మా యందు దయవుంచి వెంటనే ఇక్కడ ఉన్న మట్టి దెబ్బలు, గడ్డి చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఇల్లందు పట్టణంలోని జే.కె. కాలనీ గల సింగరేణి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ, ఇల్లందు మండల కమిటీ లా ఆధ్వర్యంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షులు దొడ్డ డానియల్, ఇల్లందు మండల కమిటీ అధ్యక్షులు పులి సైదులు, ఇల్లందు పట్టణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చల్ల శ్రీనివాసరావు, ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీమతి యదలపల్లి అనసూర్య, ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటి బిక్షం, పాయం స్వాతి, కిన్నెర నరసయ్య, బాదావత్ సరోజ, పూణే మధు, నందకిషోర్, పింగిలి నరేష్, వచ్చా వెంకన్న, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తొలిసారిగా మహిళా పోలీసుల సదస్సు

హైదరాబాద్: తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళా పోలీసుల సదస్సును ప్రారంభించారు. పోలీసు అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని యూనిట్ కార్యాలయాల నుంచి కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు 400 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా సీతక్క హాజరయ్యారు. హోం శాఖను సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నందున పోలీసుల సమస్యలను ఆయన నేరుగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. మహిళలు ఒత్తిడి వచ్చినా.. కష్టం వచ్చినా ఎలా ముందుకువెళ్లాలనే విషయాలను మంత్రి సీతక్క తన జీవితాన్నే ఉదాహరణగా చెప్పి మహిళా పోలీసుల్లో స్ఫూర్తి నింపారు. పోలీసు శాఖలో మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను సదస్సులో చర్చించారు.



## ముస్తాబాద్‌దుబ్బాక రహదారి గుంతల మయం

* ఇబ్బందులు పడుతున్న కాలినడకన వెళ్లే ప్రజలు, విద్యార్థులు
* గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ముస్తాబాద్, ప్రజాస్ఫూర్తి: ముస్తాబాద్`దుబ్బాక రహదారి గుంతల మయంగా మారింది. ఈ రోడ్డు వెంబడి అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ మార్గం గుండా ప్రయాణం చేయాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. ప్రస్తుతం గత ఐదు, ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ రోడ్డు వెంబడి పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఒకవైపు గుంతలు, మరోవైపు బురదతో కాలినడకన వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచిన కారణంగా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. వాహనదారుడు ఆ మార్గం గుండా వెళ్లే సమయంలో గుంతల్లో నిలిచి ఉన్న నీటి కారణంగా ఆ గుంత ఎంత పెద్ద మొత్తంలో ఉందో అంచనా వేయలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. ఇక ఈ పరిస్థితి రాత్రి సమయంలోనైతే మరింత దారుణంగా మారుతుంది. ఇది ఇలా ఉంటే పనుల నిమిత్తం కాలినడకన బయటకు వెళ్లే ప్రజలు, ఆ మార్గం గుండా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఏదైనా వాహనం ఆ మార్గం గుండా వచ్చిన సమయంలో గుంతల మీదుగా ఆ వాహనం వెళ్తే గుంతల్లో ఉన్న బురద నీరు ప్రజలు, విద్యార్థులపై చిమ్ముతుంది. దీంతో పనులకు వెళ్లే వారు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు బురద బట్టలతో వెళ్లే లేక ఇండ్లకు వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఏదైనా అత్యవసరమై అంబులెన్స్ ఈ మార్గం గుండా వెళ్లాలంటే ఇక అంతే సంగతులు. ఇప్పటికైనా ఈ మార్గంలో రోడ్డుకు మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది.



## దుమ్ముగూడెం తూరుబాక వద్ద రహదారి డైవర్షన్ పాయింట్ పరిశీలన

* ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి – కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరిలో వరద ఉధృతి రోజురోజుకి పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వరద పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. దుమ్ముగూడెం మండలం తూరుబాక వద్ద రహదారి పై నిర్మాణంలో ఉన్న వంతెన (బ్రిడ్జ్) డైవర్షన్ పాయింట్‌ను తనిఖీ చేసి, గోదావరి నీటి మట్టం మరింతగా పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం భద్రాచలం కరకట్టపై నుంచి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రజలందరూ ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు పూర్తి సహకారం అందించాలి అని కోరారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ లోతట్టు ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అండగా ఉంటుంది. అత్యవసరమైతే వెంటనే 100కు కాల్ చేయాలి. పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చినా ఎలాంటి భయం లేకుండా అధికారులు సూచనలను పాటించాలి" అని తెలిపారు. అలాగే భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్‌డిఆర్ఎఫ్, డిడిఆర్ఎఫ్ బృందాలు నిరంతరం విధుల్లో ఉన్నాయని, అవసరమైతే వారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం ఇల్లందు బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు . రేగా కాంతారావు హైదరాబాద్ నుండి దమ్మపేట వెళ్లే , మార్గమధ్యలో ఇల్లందు జగదంబ సెంటర్ దిండిగాల రాజేందర్ బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంనకు రావడం జరిగింది. దీంతో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

## సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ..

* 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు



అందోలు, ప్రజాస్ఫూర్తి: భారతదేశంలో టెక్నాలజీ, ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఎన్నో ఉపాధి అవకాశాల కల్పనకు ఆద్యుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని అందోలు, జోగిపేట మున్సిపల్ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు (సత్యనారాయణ ) అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ జయంతిని సందర్భంగా జోగిపేట పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, ఆర్థిక పరిపుష్టికి స్వాతంత్ర్య సాధనకు గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ రంగంలో ఆయన చేసిన అభివృద్ధి నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్ ను నిర్ణయించే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నేతలు వెల్లడించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్, మాజీ కౌన్సిలర్లు డాకూరి శంకర్, నాగరాజు, మాజీ ఎంపిటీసి వెంకటేశం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో యూరియా కొరత సృష్టించిందే తోడు దొంగలు బిజెపి, బిఆర్ఎస్

* కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తెలంగాణలో యూరియా కొరత సృష్టించిందే తోడు దొంగలైన బిజెపి, బిఆర్ఎస్ అని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో వరి సాగు ఎక్కువైంది కాబట్టి రాష్ట్రానికి ఎక్కువ యూరియా కావాలని గతంలోనే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి జెపి నడ్డాను సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కలిసి విన్నవించారని తెలిపారు. అయినప్పటికీ తెలంగాణకు సరిపడా యూరియాను అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతన్నలకి రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని దేశంలో ఏ ప్రభుత్వం చేయనంతగా రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమాల ద్వారా రైతన్నలనికి లక్ష కోట్ల వరకు ఖర్చుపెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను రైతన్నలు గమనించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ తలారి రాణి నర్సింలు, వైస్ చైర్మన్ వెల్మల రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకే తొలిమెట్టు

* పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య
* అందోలులో టీఎల్ఎన్ మెళా




అందోలు, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచి వారికి బంగారు భవిష్యత్తు కల్పించడం కోసమే ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య అన్నారు. బుధవారం అందోలులోని డీఎల్ ఫంక్షన్‌హాల్‌లో విద్యాశాఖ ఆదేశాల మేరకు ఏంఈవో బండి కృష్ణ అధ్యక్షతన టీఎల్ఎన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎల్ఎం విధానంతో విద్యాబోధన చేయడం వలన విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందని, తొలి మెట్టు విద్యార్థుల భవిష్యత్తుకు నాంది కావాలని అన్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధన పరికరాలతో పాఠశాలల్లో విద్యాబోధన చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరికరాలను రూపొందించిన ఉపాధ్యాయులను, జిల్లా స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఎంఈవో పనితీరును ఆయన కొనియాడారు. ఎంఈఓ బండి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని అంశాలు సులభతరంగా అర్థమయ్యేందుకు టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల పట్ల కొంతమంది ప్రజలకు ఉన్న అపోహలు తొలగించే దిశ గా, పాఠశాలలు మంచి ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 34 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హజరై తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానంకు సంబంధించిన బోధనాభ్యసన సామాగ్రిని ప్రదర్శించారు. ఈ మేళాను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. జిల్లాకు ఎంపికైన వారు తెలుగులో జె శాంత కుమారి (బ్రహ్మణపల్లి), అహ్మద్ పాషా (జోగిపేట) ఆంగ్లంలో .టి బాలమణి (పోతిరెడ్డిపల్లి), జి ఫణిశ్రీ (రాంసన్ పల్లి), గణితంలో టి దేవదాస్ (కన్‌సాన్‌పల్లి) ఎస్ సంగీత( మన్‌సాన్‌పల్లి), పరిసరాల విజ్ఞానంలో డి భార్గవి (అన్నసాగర్), టి కల్పన (సాయిబాన్ పేట్), ఉర్దూ మీడియంలో దుర్దన అప్సరి(అందోల్), రహీమ భాను,(జోగిపేట)లు విజేతలుగా ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు నరోత్తమ్ కుమార్, జనార్ధన్ గౌడ్, రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజమల్లు, మాయచారి, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మహేష్ చారీ, నరేష్ కుమార్, ప్రతిభరాణి, సుభాష్, మురళీ కృష్ణ, దేవిదాస్, రమేష్, రాధాబాయి, రజితలీలలు పాల్గొన్నారు.

## 8 అడుగుల నాగుపాము కలకలం!

వామ్మో..! భారీ నాగుపాము పడగ విప్పి బుసకొడుతూ కనిపించడంతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఈ ఘటన బుధవారం కొత్తగూడెం సింగరేణి మెయిన్ ఆసుపత్రి నర్సింగ్ హాస్టల్ వద్ద చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న స్నేక్ రెస్క్యూ సభ్యుడు మహేష్ అక్కడికి చేరుకొని చాకచక్యంగా 8 అడుగుల నాగుపామును పట్టుకొని సురక్షిత ప్రదేశానికి తరలించాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, వర్షాకాలంలో పాములు ఎక్కువగా బయటకు వస్తాయని,ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడైనా పాములు కనిపిస్తే వెంటనే స్నేక్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

## మారుతి కాలనీలో ఘనంగా 16 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మారుతి కాలనీలో భక్తుల సహకారంతో నిర్మించిన 16 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, 16 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, హనుమాన్ భక్తి అనేది శక్తి, భక్తి, భయరహిత జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. స్థానిక భక్తుల సహకారంతో అద్భుతంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహం కాలనీకి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కాలనీ పెద్దలు, వివిధ కాలనీల వాసులు, కాంగ్రెస్ నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగించారు.

## ఎన్నికల్లో పోటీ లేని భారత్ లేబర్ ప్రజా పార్టీ రద్దు ప్రతిపాదన

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్త గూడెం: ఎన్నికల్లో పోటీ చేయని భారత్ లేబర్ ప్రజా పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుండి తొలగించాలన్న ప్రతిపాదనను ఎన్నికల కమిషన్‌కు పంపినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.గత ఆరు సంవత్సరాలుగా ఆ పార్టీ లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ, ఉప ఎన్నికల్లో ఎక్కడా అభ్యర్థులను నిలబెట్టలేదని ఆయన వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29A ప్రకారం ఆ పార్టీ విధివిధానాలు అమలు చేయలేదని స్పష్టమైందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 324, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 కింద ఉన్న అధికారాలను వినియోగించి, ఎన్నికల కమిషన్ ఆ పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుండి తొలగించే ప్రతిపాదనను చేపట్టిందని తెలిపారు.ఈ నెల 25వ తేదీ లోగా ఆ పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ సమర్పించవలసిందిగా సూచించారు. ఆగస్టు 29న విచారణ జరగనున్నందున అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఎలాంటి సమాధానం రానట్లయితే పార్టీ తరపున అభ్యంతరం లేనట్టుగా పరిగణించి, ఎన్నికల కమిషన్ రద్దు ఉత్తర్వులు జారీ చేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



## కుషాయిగూడలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

ప్రజాస్ఫూర్తి, కాప్రా : మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్ పేట్ హెచ్.బి. కాలనీ నాలుగో డివిజన్ రాజీవ్ పార్కో భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోలిపాక అంజయ్య, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శ్రవణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని, స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధాని గా ఉన్నప్పుడు సాంకేతిక రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి భారత్‌ను అభివృద్ధి దిశగా నడిపించారని గుర్తుచేశారు. అలాగే గతంలో ఇందిరా గాంధీ హయంలో గరీబ్ అటహో నినాదంతో పేదలకు భూములు పంచినట్లు, ఇండ్లను కట్టించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పునరుద్ధరించడం సంతోషకరమని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు ఏకమై ప్రజల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుండి కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



## నకిలీ మెడిసిన్ తయారీ, విక్రయాలపై పీడీ యాక్ట్ కేసులే...

* మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు...
* మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం...
* రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ. దామోదర రాజనర్సింహా

అందోలు, ప్రజాస్ఫూర్తి: నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై మంగళవారం, వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 & 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు.సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు.పదే పదే నిబంధనలు ఉల్లఘింస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## కొత్తగూడెం లో సెప్టెంబర్ 16, 17 తేదీలలో పి.డి.ఎస్.యూ జిల్లా మహాసభలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) జిల్లా మహాసభలు కొత్తగూడెం కేంద్రంలో సెప్టెంబర్ 16, 17 తేదీలలో జరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి జె. గణేష్ పిలుపునిచ్చారు.1972లో జార్జి రెడ్డి ఆధ్వర్యంలో ఆరంభమైన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం, పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ నేటికీ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తోందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయి మహాసభలు వనపర్తిలో అక్టోబర్ 28-30లో జరగనున్న నేపథ్యంలో, జిల్లాస్థాయి సమీక్ష, భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉండటం, గురుకులాల్లో విష ఆహారం ఘటనలు, సంక్షేమ హాస్టల్స్‌లో దయనీయ పరిస్థితులు, భద్రాద్రి జిల్లాకు యూనివర్సిటీ హామీ అమలు కాని విషయం వంటి సమస్యలను తీవ్రంగా విమర్శించారు. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పి.డి.ఎస్.యూ నిరంతర పోరాటం కొనసాగిస్తోందని ఆయన తెలిపారు.జిల్లా విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు ఈ మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వి. విజయ్, డి. అరుణ్, పల్లవి, బి. ప్రశాంత్, సందీప్, శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి




రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ప్రశాంత వాతావరణంలో శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్సై అనిల్ కుమార్ కోరారు. పోలీస్ స్టేషన్ లో వినాయక నవరాత్రి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు, బాధ్యులు,ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తగు సూచనలు ఇచ్చారు. వినాయక మండపం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ నిమజ్జన సమయంలో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇతర మతస్తులకు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఆటంకాలు చేయకుండా వినాయక నవరాత్రి ఉత్సవాల పండుగను ఆనందంగా సాంప్రదాయంగా జరుపుకోవాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల వినాయకుని ఏర్పాటు చేసే వివరాలను పోలీసులకు తెలపాలని సూచించారు

# భద్రాచలంలో గోదావరిలో 1వ హెచ్చరిక

* అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి నదిలో నీటి మట్టం పెరుగుతుండడంతో భద్రాచలంలో 1వ హెచ్చరిక అమల్లోకి వచ్చింది. ఉదయం 08.15 గంటలకు నీటి మట్టం 43.00 అడుగులకు చేరి ప్రవాహం 9,32,288 క్యూసెక్కుల వద్ద నమోదయిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటన విడుదల చేసి జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**- అధికారులకు ప్రత్యేక ఆదేశాలు**

ప్రజల ప్రాణరక్షణలో ఎలాంటి లోటు చోటుచేసుకోకూడదని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు అవసరమైతే వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలని, గ్రామ స్థాయిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. "ప్రతి గ్రామంలో పరిస్థితిని నిమిషానికోసారి పరిశీలించాలి. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబడదు" అని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజలకు సూచనలు

* వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

నది తీర ప్రాంతాలకు వెళ్లరాదు
వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదు
పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలి





అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాల. అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలి ప్రభుత్వం మీతోనే ఉంది. ప్రతి ప్రాణం మాకు అమూల్యం. ప్రజల రక్షణ మా తొలి కర్తవ్యం. ఎవరూ ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం మీతో ఉంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఆ దుర్ఘటనకు అందరూ బాధ్యులే.. ఎవరికి వారు చేతులు దులిపేసుకుంటే ఎలా?: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ స్తంభాలపై కేబుళ్ల తొలగింపు అంశంపై భారతి ఎయిర్‌టెల్ తెలంగాణ హైకోర్టు లో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఎయిర్‌టెల్ పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక విచారణ చేపట్టారు. కేబుళ్ల పునరుద్ధరణ సమస్య కాదని హైకోర్టు అభిప్రాయపడింది. ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరని జస్టిస్ నగేష్ భీమపాక ప్రశ్నించారు. ''కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీహెచ్ఎంసీ, సర్వీస్ ప్రొవైడర్లు ఎవరికి వారు చేతులు దులిపేసుకుంటే ఎలా? ఈ దుర్ఘటనకు అందరూ బాధ్యులే. మనుషులంటే కాస్త దయ



చూపాలి''అని హైకోర్టు వ్యాఖ్యానించింది. విద్యుత్ స్తంభాలను వినియోగించుకుంటున్నందుకు డబ్బు చెల్లిస్తున్నామని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కేబుళ్లు కట్ చేస్తున్నారని.. ఇంటర్‌నెట్ అంతరాయంతో పలుచోట్ల సేవలు నిలిచిపోయాయని చెప్పారు. ప్రజల ప్రాణాలే పోతుంటే ఇంటర్‌నెట్ సేవలు ఎందుకని టీజీఎస్పీడీసీఎల్ తరఫు న్యాయవాది అన్నారు. స్తంభానికి పరిమితికి మించి కేబుళ్లు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల తొలగింపుపై టీజీఎస్పీడీసీఎల్, జీహెచ్ఎంసీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అప్పటివరకు కేబుళ్లు తొలగించవద్దని ఆదేశించింది.



## సికింద్రాబాద్ నుంచి బయలుదేరే పలు రైళ్ల స్టేషన్ మార్పు: దక్షిణమధ్య రైల్వే

హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి బయలుదేరాల్సిన రైళ్లను పలు స్టేషన్లకు మార్పు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబరు 20 నుంచి 26 వరకు రైళ్లు బయలుదేరే స్టేషన్ల వివరాలను అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ పోర్‌బందర్ సర్వీసు ఉందానగర్ నుంచి, సిద్దిపేటసికింద్రాబాద్ రైలు మల్కాజిగిరి నుంచి, పుణే సికింద్రాబాద్ సర్వీసు హైదరాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు.

**సికింద్రాబాద్ స్టేషన్ నుంచి చర్లపల్లికి మార్చిన రైళ్ల వివరాలివి..**

సికింద్రాబాద్ : మణుగూరు
సికింద్రాబాద్ : రేపల్లె
సికింద్రాబాద్ : సిల్చార్
సికింద్రాబాద్ : దర్భంగా
సికింద్రాబాద్ : యశ్వంత్ పూర్,
సికింద్రాబాద్ : అగర్తలా
సికింద్రాబాద్ : ముజఫర్‌పూర్
సికింద్రాబాద్ : సంత్రగచ్చి
సికింద్రాబాద్ : దానాపూర్
సికింద్రాబాద్ : రామేశ్వరం

## అంగన్వాడీల్లో చిన్నారులకు త్వరలో అల్పాహారం: మంత్రి సీతక్క

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారులకు త్వరలో అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు తెలంగాణ మహిళ, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని 139 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని.. దీంతో 30 శాతం హాజరు పెరిగిందని చెప్పారు. ప్రతి చిన్నారికీ ఉదయం 100మి.లీ పాలు సరఫరా చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీల్లోని వసతులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చిన్నారులకు వారంలో కనీసం ఒక రోజు ఎగ్ బిర్యానీ, వెజిటబుల్ బిర్యానీ



వడ్డించాలన్నారు. ''అంగన్వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి. ఇందిరమ్మ ఇళ్ల తరహాలో ఉచితంగా ఇసుక సరఫరా చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి అంగన్వాడీ భవనాలకు అనుమతులు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారు. ఒక్కో అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేశాం. నిర్మాణాలు పూర్తయిన 22 భవనాలను స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవం చేయించాలి. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ ప్రారంభించాలి''అని మంత్రి సీతక్క ఆదేశించారు.

## రైతుల శ్రేయస్సు కోసం రేవంత్‌ప్రభుత్వం పాటు పడుతుంది: మంత్రి తుమ్మల

రాష్ట్రానికి కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆరోపించారు. రైతాంగం శ్రేయస్సు కోసం రేవంత్ ప్రభుత్వం ఎల్లపుడు పాటు పడుతుందని తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ పార్లమెంట్ లో తెలంగాణ ఎంపీలు చేసిన పోరాటం ఫలించిందని ప్రశంసలు కురిపించారు. దీంతో తెలంగాణ రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ ఆమోదం తెలిపారు. కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్



మెంట్ ప్రారంభమైందని, ఈ వారంలో మరో మూడు షిప్ మెంట్ ల ద్వారా యూరియా సరఫరా కు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు ఆదేశాలు ఇచ్చిందన్నారు. యూరియా కొరత పై పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసి తెలంగాణ రైతాంగం యూరియా కష్టాల పై దేశానికి తెలిసేలా చేసిన ఎంపీలకు అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రలను రైతాంగం ఆలోచన చేయాలని సూచించారు.

## భారీ వర్షా లకు దెబ్బతిన్న రోడ్ల వివరాలపై మంత్రి కోమటిరెడ్డి ఆరా

హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరా తీశారు. కల్వర్టులు, బ్రిడ్జిలు, దెబ్బతిన్న రోడ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కల్వర్టుల వద్ద పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని.. వంతెనల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందిచాలని ఆదేశించారు. కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులను మంత్రి తెలుసుకున్నారు.



# కవితకు మీరిచ్చే బహుమతి ఇదా?..
# బీఆర్ఎస్‌పై కార్మిక సంఘ నేతల ఫైర్



కవిత టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉండడం వల్లనే కేసీఆర్‌తో మాట్లాడే దమ్ము, ధైర్యం చేశారని.. అందుకే సుప్రీంకోర్టులో కొట్టేసిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరిట ఇప్పించారని టీబీజీకేఎస్ సెంట్రల్ ట్రెజరర్ వెంకట్ అన్నారు. బుధవారం ఆయన గోదావరిఖనిలో మీడియాతో మాట్లాడారు. 19,463 నూతన ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కవితది అని చెప్పారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవితను తొలగించడంపై ఆయన తీవ్ర నిరసన తెలిపారు. అందులో భాగంగానే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కోశాధికారిగా రాజీనామా చేశారు. పదేళ్లు గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ ఎలాంటి జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకుండానే గౌరవ అధ్యక్షురాలిగా మార్చడం సరికాదన్నారు. ప్రభుత్వానికి, కార్మికులకు వారిధిగా కవిత ఉన్నారని చెప్పారు. ఇంత అద్భుతంగా పనిచేసిన కవితకు మీరిచ్చే బహుమతి ఇదా అని ప్రశ్నించారు. కవిత ఆధ్వర్యంలో బాయి బాట కార్యక్రమం త్వరలో ఏర్పాటు చేసుకుంటామని వివరించారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతోపాటే మరో వంద మంది రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భువనచంద్ర రాకేష్, అనిల్, హరీష్, మనోజ్, హరి, రవి, శ్రీకాంత్ రెడ్డి, విష్ణు, గణేష్, హఫీజ్, నవీన్ రెడ్డి, పృధ్వి, నిశాంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం.. చిన్నారులకు గాయాలు

లింగాల ఘనపురం: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందగా.. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ సూర్యాపేట హైవేపై వడ్డిచర్ల వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రవణ్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లపూడికి చెందిన దద్దోజు సురేశ్, దివ్య దంపతులకు లోక్షణ, మోక్షజ్ఞ పిల్లలున్నారు. కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో సురేశ్ పనిచేస్తున్నారు. స్వగ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం భార్యపిల్లలతో కలిసి బొలెరో వాహనంలో కరీంనగర్‌కు బయల్దేరారు. మార్గంమధ్యలో లింగాల ఘనపురం మండలం వడ్డిచర్ల నక్షత్ర గార్డెన్ వద్ద వారి వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. సురేశ్ అక్కడికక్కడే మృతిచెందగా.. దివ్య 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తొలగిన కోర్టు స్టే.. దరఖాస్తులకు పరిష్కారం

గత ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశారని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. బుధవారం గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల, ప్రజల సమస్యలు



పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. వీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర హైకోర్టు సాదాబైనామాలపై ఉన్న స్టేను తొలగించినందున అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రకటించారు. అలాగే.. రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సీఎం నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వ తప్పులను గమనించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రగతి సాధనలో సాగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో గల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 6263 శాతం ఆదాయం లభిస్తున్నదని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ భవనం అత్యాధునిక కార్పొరేట్ స్థాయిలో ఉండబోతున్నదని, సుమారు మూడు ఎకరాలలోని దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, 300 కార్లు పార్కింగ్ సౌకర్యం తదితరాలతో నిర్మాణం కాబోతున్నదని చెప్పారు. ఫైవ్ స్టార్ సౌకర్యాలు సుమారు 89 నెలల్లో ఈ భవనాన్ని నిర్మిస్తామని నిర్మాణ సంస్థ చెబుతున్నట్లు తెలిపారు. 67 నెలల్లోగా పూర్తి చేయాలని మంత్రి సభా ముఖంగా కోరారు.

## 'కేవలం ఆయన వల్లే మంత్రిని కాగలిగా'.. కొండా సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు

మంత్రి పదవిపై కొండా సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ నాడు స్థానిక సంస్థల్లో ఇచ్చిన రిజర్వేషన్ల వల్లనే తాను ఈనాడు మంత్రి స్థాయికి ఎదిగానని, లీడర్‌గా నిలిచానని అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వరంగల్ ఎంజీఎం సెంటర్లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ అని.. ఆయన ఈ దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ప్రాణాలర్పించారని మంత్రి కొండా సురేఖ



కొనియాడారు. దేశంలో పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికతను జోడించాలని ఆనాడు రాజీవ్ గాంధీ ఆలోచన చేశారని పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే అవకాశం కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించిన దార్శనికుడన్నారు. కంప్యూటరును దేశానికి పరిచయం చేసిన మహనీయుడన్నారు. టెలికాం రంగంతో దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. రాజీవ్ స్ఫూర్తితో ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి పునాది పడిందన్నారు.

# విద్యలో డిజిటల్ విప్లవం.. యూఎడ్యుకేట్‌తో NCERT కీలక ఒప్పందం

దిల్లీ: భారతదేశ విద్యారంగంలో సంచలన మార్పులు తీసుకొచ్చే ప్రాజెక్టుకు జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి (NCERT) శ్రీకారం చుట్టింది. యూఎడ్యుకేట్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఓ కీలక ఒప్పందంపై సంతకం చేసింది. విద్యను మరింత ఇంటరాక్టివ్‌గా, సాంకేతిక ఆధారితంగా మార్చడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకుంది. యూఎడ్యుకేట్ సహకారంతో ఎన్సీఈఆర్టీ తన మొత్తం పాఠ్యాంశాల్ని KAT BOOK అనే ఇంటరాక్టివ్ డిజిటల్ ఫార్మాట్‌లోకి మార్చనుంది. ఈ ఫార్మాట్‌లో చదివే విద్యార్థులకు పాఠ్యాంశం వీడియోలు, యానిమేషన్‌లు, 3డీ మోడల్స్, సిమ్యులేషన్ల వంటి వివిధ మాధ్యమాలు అందుబాటులో ఉంటాయి. తద్వారా క్లిష్టమైన అంశాలను సైతం విద్యార్థులు సులభంగా అర్థం చేసుకొనేలా రూపొందిస్తున్నారు. ఈ ఒప్పందం సందర్భంగా యూఎడ్యుకేట్ గ్లోబల్ వ్యవస్థాపకుడు, ఎండీ శరత్ కాకుమాను మాట్లాడారు. ఈ ఒప్పందం భారతీయ విద్యను మార్చే ప్రయాణంలో కీలక ఘట్టమన్నారు. KAT BOOK ద్వారా తాము టీచర్లు, విద్యార్థులకు బోధనలో సహకారం అందిస్తామన్న ఆయన.. విద్యను మరింత సరదాగా, అందరికీ చేరేలా అన్ని భాషల్లో అందేలా చేస్తామన్నారు. ప్రతి పిల్లవాడికీ నాణ్యమైన విద్య అందించాలనే తమ సంకల్పం ఈ ఒప్పందం ద్వారా నెరవేరబోతోందన్నారు. దీన్ని తొలుత కొన్ని రాష్ట్రాల్లో పైలట్ ప్రోగ్రామ్‌గా అమలు చేసి ఆ తర్వాత వచ్చే 18 నెలల్లో దీన్ని దేశ వ్యాప్తంగా విస్తరించనున్నారు. ఈ ఒప్పంద పత్రాలపై ఎన్సీఈఆర్టీ కార్యదర్శి అమన్ శర్మ, యూఎడ్యుకేట్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ డైరెక్టర్ మన్‌ప్రీత్ చద్దా ఉన్నతాధికారుల



సమక్షంలో సంతకాలు చేశారు. జాతీయ విద్యా విధానం 2020, డిజిటల్ ఇండియా మిషన్ లక్ష్యాలకనుగుణంగా విద్యారంగంలో జరిగే ఉన్నత ప్రయోగాల్లో ఈ ప్రాజెక్టు ఒకటిగా నిలుస్తుందని పలువురు అధికారులు అభిప్రాయపడ్డారు. KATBOOK డిజిటల్ పుస్తకాల్లో ఏఐ ఆధారిత క్లాస్‌రూమ్ టూల్స్, అనువాదాలు, డిక్షనరీలు, ఆడియో బుక్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. విద్యార్థులు నేర్చుకొనే విధానాన్ని ఉపాధ్యాయులే ప్రత్యక్షంగా పర్యవేక్షించి.. వారు ఎదుర్కొనే ఇబ్బందులను గమనించి మరింత మెరుగైన బోధనా పద్ధతులను అనుసరించొచ్చు. విద్యార్థులకు సైతం వ్యక్తిగత అవసరాలకు తగిన విధంగా వనరులు ఇందులో అందుబాటులో ఉంటాయి. అయితే, ఇవి ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకొనే అవకాశం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకూ ప్రయోజనం కలగనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో దాదాపు 2.5 కోట్ల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతారని అంచనా.

## ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



దిల్లీ: డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కొంతమంది బానిస కావడం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈస్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

## 'అగ్ని-5' మధ్యంతర శ్రేణి క్షిపణి పరీక్ష విజయవంతం

వ్యూహాత్మక సైనిక సామర్థ్యాలను చాటుతూ.. మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని 5'ని భారత్ విజయవంతంగా పరీక్షించింది. రక్షణ శాఖ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఒడిశాలోని చాందీపుర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగం.. అన్ని సాంకేతిక, కార్యాచరణ పరామితులను అందుకున్నట్లు ప్రకటించాయి. 'స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్' ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగినట్లు తెలిపాయి. ఈ క్షిపణి పరిధి దాదాపు 5 వేల



కిలోమీటర్లు. చివరిసారి గతేడాది మార్చి 11న 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యంతో రూపొందించిన 'అగ్ని 5' క్షిపణిని భారత్ పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అధునాతన క్షిపణిని 'మల్టీపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్' సాంకేతికతతో రూపొందించారు. దీనిద్వారా ఒకే క్షిపణి సాయంతో అనేక వార్‌హెడ్లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు. ఈ ఏడాది జులైలో అగ్ని 1 స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించారు.

## అది కేవలం నాపై జరిగిన దాడి మాత్రమే కాదు..: దిల్లీ సీఎం

దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. సివిల్ లైన్స్‌లోని అధికారిక నివాసంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై సీఎం రేఖా గుప్తా తొలిసారి స్పందించారు. ఇది కేవలం తనపై జరిగిన దాడి కాదని.. దిల్లీకి సేవ చేయాలనే, ప్రజాసంక్షేమానికి పాటుపడాలనే తమ సంకల్పంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. "ఈ రోజు ఉదయం ప్రజాఫిర్యాదుల విచారణ సందర్భంగా దాడి జరిగింది. ఇది కేవలం నాపై జరిగిన దాడి కాదు. దిల్లీకి సేవ చేయాలనే, ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలనే మా సంకల్పంపైనా జరిగిన పిరికిపంద ప్రయత్నం. ఈ ఘటనానంతరం



షాక్‌కు గురయ్యాను. ప్రస్తుతం తేరుకున్నాను. త్వరలోనే అందరి ముందుకు వస్తాను. ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పాన్ని ఇటువంటి ఘటనలు దెబ్బతీయలేవు. ప్రజల నమ్మకం, మద్దతే నాకు కొండంత బలం. ఇప్పుడు మరింత ఉత్సాహంతో, అంకితభావంతో ప్రజల మధ్య ఉంటాను. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం అదే నిబద్ధతతో కొనసాగుతాయి" అని సీఎం రేఖా గుప్తా పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీఎం రేఖా గుప్తా తన అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి.. కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే ఆమెపై దాడి చేశాడు. వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నారు. రేఖా గుప్తాను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి.

## కీలక బిల్లులు లోక్‌సభ ముందుకు..



తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు బిల్లులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు ఆరోపించాయి. ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లు ప్రతులను చించి విసిరారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ.. అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానన్నారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ.. రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదన్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నిరసనల నడుమ సభ వాయిదా పడింది. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని; రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకూ అనుమతిస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెలరోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## లోక్‌సభ ముందుకు కీలక బిల్లు.. శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ

గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపీ శశిథరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపై కూడా ఆయన పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైనదన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. 'ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కన్పించడం లేదు' అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకి పంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ.. అది ఎంతో మంచి విషయమన్నారు. అది మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల



రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## నిషేధం కాదు.. నియంత్రించండి.. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుపై అమిత్‌షాకు లేఖ

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఏఐజీఎఫ్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్లమంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాక.. ఈ రంగంలోని అనేకమంది ఉద్యోగులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈసందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే.. దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు



తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగిపోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ.. 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

## భారత్‌చైనాల మధ్య త్వరలో సరిహద్దు నిర్ధరణ ప్రక్రియ?

వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయాల్లో భాగంగా.. భారత్‌చైనాల మధ్య సరిహద్దు నిర్ధరణ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇరుదేశాల మధ్య తక్కువ వివాదాలు ఉన్న ప్రదేశాల్లో కచ్చితమైన శాశ్వత సరిహద్దును గుర్తించే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. చైనా ప్రత్యేక ప్రతినిధి వాంగ్‌యీ, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ల మధ్య జరిగిన చర్చల్లో ఈ ప్రతిపాదనకు ఇరువర్గాలు అంగీకారం తెలిపినట్లు సమాచారం. అయితే.. ఈ భేటీ ఫలితాలపై ఇరువర్గాలు గుంభనంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే సరిహద్దుల్లోని మూడు సెక్టార్లలో డోభాల్‌వాంగ్‌యీ కలిసి స్వల్ప వివాదాలు ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు తెలుస్తోంది.

### గుర్తించేది ఇలా..

చర్చల్లో భాగంగా మొదటి మెట్టుగా భారత్‌చైనాల మధ్య సరిహద్దు అంశాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు. దీనికి విదేశాంగశాఖ సంయుక్త కార్యదర్శి అధ్యక్షత వహించనున్నారు. ఇక రెండో మెట్టుగా.. ఇరువైపుల నుంచి స్వల్ప అభ్యంతరాలు ఉన్న భూభాగాలను గుర్తించనున్నారు. మూడోదశలో భాగంగా ఈ



ప్రదేశాలను స్పష్టంగా పునర్విభజించనున్నారు. ఇక చివరి దశలో భాగంగా గుర్తులు, అంతర్జాతీయ సరిహద్దులను సూచించే పిల్లర్లను పాతనున్నారు. ఇరుపక్షాలు సైనిక దళాలను వెనక్కి తీసుకొన్న తర్వాత అవసరమైన చర్యల దిశగా వాంగ్‌యీ అజిత్ డోభాల్ ఇప్పటికే అడుగులు వేశారు. వివాదాస్పద ప్రదేశాల్లో బఫర్ జోన్ల ఏర్పాటు అంశం ఇంకా పరిష్కారం కావాల్సిఉంది. ఇక ఇరుపక్షాలు సరిహద్దుల్లో శాంతిని కొనసాగించడానికి అంగీకరించాయి. ఏప్రిల్ 2020 ఘర్షణ తర్వాత పరిస్థితుల నుంచి భారత్‌చైనా వేగంగా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకొస్తున్నాయి. 23 అక్టోబర్ 2024న జిన్‌పింగ్‌మోదీ స్వల్ప భేటీ తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. వీరిద్దరూ మరోసారి ఎస్సీవో సదస్సులో సమావేశం కావడానికి రంగం సిద్ధమవుతోంది. రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ.. మంగళవారం ప్రధాని (PM Modi)తో భేటీ అయ్యారు. సరిహద్దులో శాంతిని ఉమ్మడిగా కాపాడుకోవడం, వాణిజ్యానికి సరిహద్దుల్ని మళ్లీ తెరవడం, వివిధ రకాల వీసాలకు వెసులుబాటు కల్పించడం, పెట్టుబడుల వెల్లువను ప్రోత్సహించడం, నేరుగా విమాన సర్వీసులను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడం, నదీ జలాల పంపకంలో సహకరించుకోవడంపై ఉభయపక్షాలు సుముఖత వ్యక్తంచేశాయి. భారత్‌పై వాణిజ్య సుంకాలను అమెరికా (USA) ఎడాపెడా పెంచేస్తున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌చైనా సంబంధాలు స్థిరంగా పురోగతి సాధిస్తున్నాయని ఈ సమావేశానంతరం మోదీ వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సదస్సు (ఎస్సీవో)లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కలిసేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. సరిహద్దులో శాంతి నెలకొనడం కీలకమని వాంగ్ యీతో భేటీలో మోదీ స్పష్టం చేసినట్లు పీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది. ఇక ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చల్లో భాగంగా వాంగ్ యీ.. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో అంతకుముందు సమావేశమయ్యారు.

## 30,000 ఉద్యోగాల తొలగింపు..

**స్పందించిన టీసీఎస్**

**టీసీఎస్‌లో ఉద్యోగాల తొలగింపుపై నిరసనలు**

**30 వేల మందిని తీసేస్తున్నారని ఐటీ ఉద్యోగుల యూనియన్ ఆరోపణ**

**ఆరోపణలను ఖండించిన టీసీఎస్, కేవలం 2 శాతమేనని స్పష్టీకరణ**

**అనుభవజ్ఞులనే లక్ష్యంగా చేసుకున్నారని సంఘాల ఆందోళన**

**వివాదంలో జోక్యం చేసుకున్న కర్ణాటక కార్మిక శాఖ**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఉద్యోగాల తొలగింపు అంశం తీవ్ర కలకలం రేపుతోంది. కంపెనీ వేలాది మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైందంటూ ఐటీ ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. సుమారు 30,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నారని యూనియన్లు ఆరోపిస్తుండగా, టీసీఎస్ మాత్రం ఈ సంఖ్యను ఖండించింది.

సీఐటీయూ మద్దతుతో యునైటెడ్ ఐటీ అండ్ ఐటీఈఎస్ ఎంప్లాయీస్ (యూనైట్) ఆధ్వర్యంలో పలు నగరాల్లో నిరసనలు జరిగాయి. తొలగింపు నిర్ణయాన్ని టీసీఎస్ వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

"తొలగింపునకు గురవుతున్న వారిలో అత్యధికులు అనుభవజ్ఞులే. మంచి నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని కూడా తీసివేయడం ఆందోళన కలిగిస్తోంది" అని యూనైట్ జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అంతర్జాతీయ కార్మిక సంఘాలతో కలిసి ఈ పోరాటాన్ని ప్రపంచవ్యాప్తం చేస్తామని హెచ్చరించారు.

అనుభవజ్ఞుల స్థానంలో కొత్తగా చేరిన ఫ్రెషర్లను 80-85 శాతం తక్కువ జీతానికి నియమించుకుంటోందని యూనైట్ ఆరోపిస్తోంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని హితవు పలికింది. రూ. 2.55 లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని పేర్కొంది.

ఉద్యోగ సంఘాల ఆరోపణలను టీసీఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు "తప్పుదోవ పట్టించేవి, అవాస్తవం" అని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగులలో కేవలం 2 శాతం మందిపై, అంటే సుమారు 12,000 మందిపై మాత్రమే ఈ ప్రభావం ఉంటుందని స్పష్టం చేసింది. క్లౌడ్, ఏఐ వంటి భవిష్యత్ సాంకేతికతలకు అనుగుణంగా సంస్థను పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు వివరించింది. ప్రభావిత ఉద్యోగులకు పరిహారంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ వివాదంపై కర్ణాటక స్టేట్ ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (కిటు) ఫిర్యాదుతో కర్ణాటక కార్మిక శాఖ రంగంలోకి దిగింది. ఇటీవల కార్మిక శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, ఏ నగరంలో ఎంతమందిని తొలగిస్తారనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదని వారు అధికారులకు వివరించారు. చట్ట ప్రకారం ఉద్యోగుల హక్కులను గౌరవించాలని, వారికి సరైన పరిహారం అందించాలని కార్మిక శాఖ అధికారులు కంపెనీకి సూచించారు.

## ఉద్యోగులకు ఇన్ఫోసిస్ గుడ్‌న్యూస్..

**వారికి 80 శాతం బోనస్**

**ఇన్ఫోసిస్ ఉద్యోగులకు పనితీరు బోనస్ ప్రకటన**

**సగటున 80 శాతం బోనస్ చెల్లించనున్న సంస్థ**

**జూనియర్, మిడ్ లెవల్ ఉద్యోగులకు వర్తింపు**

**క్యూ1లో అంచనాలను మించిన ఆదాయం, లాభాలు**

**గత త్రైమాసికం కంటే గణనీయంగా పెరిగిన బోనస్ శాతం**

**జనవరి నుంచి 6-8 శాతం జీతాల పెంపు కూడా అమలు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు శుభవార్తను అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్ 2025) గాను పనితీరు ఆధారిత బోనస్‌ను ప్రకటించింది. ఈసారి సగటున 80 శాతం బోనస్‌ను చెల్లించనున్నట్లు కంపెనీ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత సమాచారంలో వెల్లడించింది.

జూన్ త్రైమాసికంలో కంపెనీ అంచనాలను మించి అద్భుతమైన ఆర్థిక ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఈ బోనస్ నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ ప్రధానంగా బ్యాండ్ 6, ఆ కింది స్థాయి ఉద్యోగులకు, అంటే జూనియర్, మిడ్-లెవల్ సిబ్బందికి వర్తిస్తుంది. ఉద్యోగుల పనితీరు రేటింగ్‌ను బట్టి బోనస్ శాతంలో మార్పులు ఉంటాయి. పీఎల్6 స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి 85 శాతం బోనస్ లభించనుండగా, అత్యల్పంగా 75 శాతం అందుతుంది. అదేవిధంగా పీఎల్4 స్థాయి ఉద్యోగులకు 80 నుంచి 89 శాతం మధ్య బోనస్ చెల్లిస్తారు. గత త్రైమాసికంలో అర్హులైన సిబ్బందికి సగటున 65 శాతం బోనస్ మాత్రమే చెల్లించగా, ఈసారి దానిని 80 శాతానికి పెంచడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఇన్ఫోసిస్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8.7 శాతం పెరిగి రూ. 6,921 కోట్లకు చేరింది. అదే సమయంలో, ఆదాయం 7.5 శాతం వృద్ధితో రూ. 42,279 కోట్లుగా నమోదైంది.

## బేసిక్ ఐఫోన్ 18 మోడల్ వచ్చే ఏడాది రిలీజ్ కావడం లేదు..



**న్యూఢిల్లీ:** యాపిల్ సంస్థ ప్రతి ఏడాది ఐఫోన్ మోడళ్లను రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే వచ్చే ఏడాది ఐఫోన్ 18 మోడల్‌ను రిలీజ్ చేయడం లేదని తెలిసింది. ఐఫోన్ 18 బేసిక్ వర్షన్ ఐఫోన్‌ను 2027లో రిలీజ్ చేయనున్నట్లు ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. సెప్టెంబర్ 2026లో ఐఫోన్ 18 బేసిక్ మోడల్ రిలీజ్ కావడం లేదని యాపిల్ కంపెనీ తన భాగస్వామ్య కంపెనీలకు చెప్పింది. వచ్చే ఏడాది హయ్యర్ ఎండ్ మోడల్స్‌ను ఆవిష్కరించనున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. స్టాండర్డ్ ఐఫోన్ 18, ఎంట్రీ లెవల్ ఐఫోన్ 18ఈ మోడల్స్ మాత్రం 2027 తొలి అర్థభాగంలో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

సెప్టెంబర్ 2026లో ఫోల్డబుల్ ఐఫోన్‌ను యాపిల్ కంపెనీ లాంచ్ చేయాలని భావిస్తున్నట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. దీనితో పాటు ఐఫోన్ 18 ఎయిర్, ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రోమ్యాక్స్ రిలీజ్ అవుతాయి. కేవలం ప్రీమియం మోడళ్లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. అయితే బేస్, ఎంట్రీ లెవల్ వర్షన్స్ మాత్రం మరో ఆరు నెలల తర్వాత రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. ఫోల్డబుల్ ఐఫోన్, ఐఫోన్ 18 ప్రో మోడల్స్ వచ్చే ఏడాది రెండో భాగంలో రిలీజ్ కానున్నట్లు టెక్ విశ్లేషకుడు మింగ్ చి కూవో పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక స్టాండర్డ్ ఐఫోన్ 18, ఐఫోన్ 18ఈ మోడళ్లు మాత్రం 2027లో రిలీజ్ అవుతాయన్నారు.

# యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై స్పందించిన ధనశ్రీవర్మ..!






**న్యూఢిల్లీ:** టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై ఆయన మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ తొలిసారిగా స్పందించారు. విడాకుల సమయంలో కోర్టులో ఎదుర్కొన్న మానసిక వేదనను, ఆ తర్వాత జరిగిన టీ-షర్ట్ వివాదాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కోర్టులో తీర్పు వెలువరించే సమయంలో ఆమె తన భావోద్వేగాలను కంట్రోల్ చేయలేక, అందరితో కలిసి కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో ధనశ్రీ మాట్లాడింది. 'విడాకుల రోజున మేమిద్దరం కూడా మానసికంగా సిద్ధమయ్యే ప్రయత్నం చేసాం. కానీ, తీర్పు ఇవ్వబోతున్నప్పుడు, నా భావోద్వేగాలను అదుపు చేయలేకపోయాను.

ఆ క్షణంలో నేను ఎంత బాధపడుతానో చెప్పలేక ఒక రకంగా ఏడ్చేశాను. ఆ తర్వాత చాహల్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు' అని చెప్పింది. విడాకుల సమయంలో చాహల్ ధరించిన 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని రాసి ఉన్న టీ-షర్ట్ పెద్ద వివాదాన్ని రేపింది. దీనిపై ధనశ్రీ స్పందిస్తూ 'ఈ విషయంలో ప్రజలు నన్నే నిందిస్తారని మేం ముందే ఊహించాం. టీ-షర్ట్ గురించి తెలిసేలోపే.. నాపై నిందలు మోపుతారనే అభిప్రాయం ఏర్పడింది' అని తెలిపింది. కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత చాహల్ టీ-షర్ట్‌కి సంబంధించిన వీడియోలను చూసి ఆమె ఆశ్చర్యపోయానని చెబుతూ.. 'అరే, వాట్సాప్‌లో చెప్పొచ్చు కదా! అలా ఎందుకు వేసుకున్నాడో?' అని ఆమె వ్యాఖ్యానించారు.

ఇలాంటి సున్నితమైన విషయాలను ఎంతో పరిపక్వతతో చూసుకోవాలని భావించానని అన్నారు. 'ప్రజలను ఆకట్టుకోవడం కోసం అనాలోచిత వ్యాఖ్యలు చేయడం నాకు ఇష్టం లేదు. మా కుటుంబ విలువలను, అతని కుటుంబ గౌరవాన్ని కాపాడాలనే భావనతోనే అలా స్పందించాను' అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పరిస్థితిని వివరిస్తూ 'మహిళగా, బంధాన్ని నిలబెట్టుకోవాలని, అన్నింటినీ మినహాయించుకొని జీవనం సాగించాలని మనం నేర్చుకుంటాం. మన తల్లులు ఎంతో గౌరవంగా ఆ మాటలు చెప్పినట్లయితే, అది నిజమే' అని తెలిపారు. పెళ్లి బంధంలో ఉన్నప్పుడు, తన భర్త చాహల్‌కు తాను అండగా నిలిచానని, చిన్న చిన్న విషయాల నుంచి పెద్ద విషయాల వరకు అతనితో అంగీకారంగా ఉంటూ ఎప్పుడూ కృషి చేశానని ధనశ్రీ గుర్తు చేసుకున్నారు. చాహల్, ధనశ్రీ వర్మ 2020లో వివాహం చేసుకున్న తర్వాత ఐదేళ్ల వివాహ బంధం ముగియడంతో ఈ విడాకులు తీసుకున్న విషయం ఇటీవల వార్తల్లో నిలిచింది.

## గిల్‌కు వైస్ కెప్టెన్సీ.. సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

**ఆసియా కప్‌కు భారత వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నియామకం**

**గిల్ ఎంపిక సరైన నిర్ణయమన్న సునీల్ గవాస్కర్**

**భవిష్యత్తులో గిల్ మూడు ఫార్మాట్ల కెప్టెన్ అవుతాడని జోస్యం**

**కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ కొనసాగింపు**

**సెప్టెంబర్ 9 నుంచి దుబాయ్, అబుదాబిలో టోర్నీ**



**న్యూఢిల్లీ:** టీమిండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌పై భారత దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. త్వరలో జరగనున్న ఆసియా కప్ 2025 టోర్నీకి గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం సరైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో భారత జట్టును మూడు ఫార్మాట్లలో నడిపించగల సత్తా గిల్‌కు ఉందని, ఈ నియామకం ఆ దిశగా వేసిన తొలి అడుగేనని ఆయన పేర్కొన్నాడు.

ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో గిల్ అద్భుతంగా రాణించిన విషయాన్ని గవాస్కర్ గుర్తుచేశారు. "కొన్ని వారాల క్రితమే గిల్ ఇంగ్లండ్‌లో 750కి పైగా పరుగులు సాధించాడు. అంతటి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని పక్కన పెట్టలేం. తొలిసారి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినా ఒత్తిడిని తట్టుకుని జట్టును నడిపించిన తీరు అమోఘం. అతడికి వైస్-కెప్టెన్సీ ఇవ్వడం ద్వారా, భవిష్యత్తులో టీ20 జట్టుకు నాయకత్వం వహించేది తనే అనే స్పష్టమైన సంకేతాలు పంపారు. ఇది చాలా మంచి ఎంపిక" అని గవాస్కర్ ఇండియా టుడేతో అన్నారు. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు అబుదాబి, దుబాయ్ వేదికగా ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నీకి సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతేడాది టీ20 ప్రపంచకప్ తర్వాత జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం బలాన్ని పెంచింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ జట్టును ప్రకటించాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్‌తో పాటు గ్రూప్ 'ఏ'లో పాకిస్థాన్, ఒమన్, యూఏఈ ఉన్నాయి.

## చిక్కుల్లో పాకిస్తాన్ మాజీ కెప్టెన్..

**వసిం అక్రమ్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు..**



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసిం అక్రమ్ చిక్కుల్లో పడ్డాడు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు ప్రచారం చేస్తున్న మాజీ బౌలర్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. జూదం, బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న అక్రమ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముహమ్మద్ ఫైజ్ లాహోర్‌లోని నేషన్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశాడు. విదేశీ బెట్టింగ్ యాప్ 'బాజీ'తో అక్రమ్‌కు సంబంధం ఉందని ఫైజ్ ఆరోపించారు. పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ ఈ బెట్టింగ్ యాప్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అయిన పోస్టర్, వీడియో క్లిప్‌లో వసీం అక్రమ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు మద్దతు తెలుస్తోందని.. ఇది యాప్‌పై సాధారణ ప్రజల్లో ఆసక్తిని పెంచిందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ క్రైమ్స్ యాక్ట్ 2016 కింద అక్రమ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫైజ్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశాడు.

ఇదిలా ఉండగా.. భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన పలువురు సెలబ్రిటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నిస్తున్నది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన అనేక కేసులను ఏజెన్సీ దర్యాప్తు చేస్తోంది. చాలామంది పెట్టుబడిదారులను రూ.కోట్లల్లో మోసం చేయడం, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆ యాప్‌కు సంబంధించిన ప్రకటనల్లో పాల్గొన్న వ్యక్తులు, ముఖ్యంగా సినీతారలు, క్రికెటర్లపై ఈడీ చర్యలు చేపడుతున్నది. ఈ కేసులో ఈడీ చాలా మంది నటీనటులు, ప్లేయర్స్‌ను ప్రశ్నించింది. ఈ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్ ప్రజల నుంచి డబ్బును దోచుకుంటున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు తమను తాము నాలెడ్జ్ ఆధారిత గేమింగ్‌గా చూపించుకుంటాయని, కానీ నకిలీ అల్గారిథమ్‌ల ద్వారా అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తాయని దర్యాప్తులో వెల్లడైంది.

# ఆసియా కప్‌కు జైస్వాల్‌ను ఎంపిక చేయకపోవడం అన్యాయం

**మాజీ స్పిన్నర్ ఆర్ అశ్విన్**



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 కోసం భారత టీ20 జట్టును ప్రకటించిన తర్వాత, సెలక్షన్ కమిటీ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడం టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఆశ్చర్యకరంగా ఉందని.. నిరాశ కలిగించిందని పేర్కొన్నాడు. జైస్వాల్‌ను ఇలా పక్కన పెట్టడం అన్యాయంగా అభిప్రాయపడ్డాడు. అద్భుతంగా ప్రదర్శిస్తున్న ఆటగాడికి ఇలాంటి అన్యాయం జరిగితే ఆటతీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన తెలిపాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా తీసుకుని జట్టులోకి తీసుకోగా.. జైస్వాల్‌ను జట్టు నుంచి తప్పించింది. ఈ నిర్ణయం పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించారు. 'జట్టు కోసం నిస్వార్థంగా ఆడే యువ ఆటగాడు జైస్వాల్. ఇలా తప్పించబడడం చాలా బాధాకరం.

అతను తన వ్యక్తిగత రికార్డులను కంటే జట్టును ముందుపెట్టే ఆటగాడు. ఇలాంటి నిర్ణయం వల్ల అతను జట్టుకు కాకుండా.. తన వ్యక్తిగత విజయాల కోసం ఆడే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది' అంటూ ఆందోళన వ్యక్తం చేశాడు. జైస్వాల్ ప్రదర్శనను గురించి మాట్లాడే సమయంలో టెస్టు క్రికెట్‌లో అవకాశం ఇచ్చిన వెంటనే తన ప్రతిభను అందిపుచ్చుకున్నాడు. ఇటీవల భారత టెస్ట్ బ్యాటర్లలో అతను అత్యంత విజయవంతంగా నిలిచాడు. ఏ ఫార్మాట్‌లో అవకాశం ఇచ్చినా, అతను జట్టుకు అత్యుత్తమంగా రాణించాడు. ఇంత మంచి ఆటగాడికి జట్టులో చోటు ఇవ్వకపోవడం అర్థం కావడం లేదని అశ్విన్ పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌లో జైస్వాల్ 165 స్ట్రయిక్ రేట్‌తో ఆడుతున్నాడని, ఎప్పటికప్పుడు జట్టుకు ప్రాధాన్యత ఇస్తున్నాడని అశ్విన్ చెప్పాడు. జైస్వాల్ వంటి ఆటగాళ్లు దొరకడం చాలా కష్టమైన విషయం. బంతిని బాదాల్సినప్పుడే కాదు.. కష్టం వచ్చినప్పుడు కూడా శక్తితో ఆడేందుకు ప్రయత్నిస్తాడని.. అలాంటి ఆటగాళ్లను ప్రోత్సహించడం కంటే, ఇలా పక్కన పెట్టడం అసంబద్ధమని అశ్విన్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల జైస్వాల్ మళ్లీ తన కెరీర్‌ను మొదటి నుంచి పునరుద్ధరించుకోవాల్సి వచ్చే పరిస్థితి వచ్చిందని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం ప్రస్తుత టోర్నీ కోసమే కాకుండా.. భవిష్యత్ కెప్టెన్సీని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయంగా అశ్విన్ చెప్పుకొచ్చాడు. సెలక్టర్లు శుభ్‌మాన్ గిల్‌ను భవిష్యత్ కెప్టెన్‌గా పరిగణించే అవకాశం ఉందని.. బహుశా అన్ని ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా కనిపించొచ్చని.. అయితే, ప్రతి ఫార్మాట్‌లో ఒకే ఒక కెప్టెన్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ సంజు సామ్సన్‌పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని అశ్విన్ తెలిపాడు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించిన వెంటనే, సామ్సన్ స్థానానికి ముప్పు ఏర్పడిందని.. దీని అర్థం సంజు సామ్సన్ ఆడకపోవచ్చని.. శుభ్‌మాన్ గిల్ ఖచ్చితంగా ఆడుతాడని, ఓపెనర్‌గా వస్తాడని పేర్కొన్నారు. శామ్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని.. గతేడాది టీ20ల్లో మూడు సెంచరీలు చేశాడని గుర్తు చేశాడు.

## మంచి లవ్ స్టోరీ కోసం
# మోక్షజ్ఞ చూపు



**టాకీస్:** నందమూరి అభిమానులతో పాటు- సినీ ప్రియులంతా బాల్య నటవారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీకి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీకి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు. అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ ఉండే అవకాశం ఉందని నారా రోహిత్ తెలిపారు.

## హరిహరవీరమల్లు ఓటీటీలో క్లైమాక్స్‌లో కట్స్



**టాకీస్:** పవన్ కల్యాణ్ తొలి పాన్ ఇండియా సినిమా 'హరి హర వీరమల్లు' ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ సినిమా థియేటర్ వెర్షన్‌లో కొన్ని మార్పులు చేసి ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చారు. థియేటర్‌లో ఈ సినిమా విడుదలైనప్పుడు ఇందులోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని సీన్స్‌లోని వీఎఫ్ఎక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహించాల్సిందని కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆ సన్నివేశాలను ఓటీటీ- వెర్షన్‌లో తొలగించినట్లు- సమాచారం. ముఖ్యంగా గుర్రపు స్వారీ సన్నివేశం, పవన్ కల్యాణ్ బాణం గురిపెట్టే సీన్స్‌ను థియేటర్లో విడుదలైన తర్వాత మార్పులు చేశారు. అయితే ఓటీటీలో ఈ సన్నివేశాలను పూర్తిగా కట్ చేశారని నెటిజన్లు పేర్కొంటున్నారు. క్లైమాక్స్‌లోనూ కొన్ని మార్పులు చేసినట్లు- తెలుస్తోంది. అసుర హననం పాట తర్వాత పార్ట్2 ప్రకటనతో సినిమాను పూర్తి చేశారట. క్లైమాక్స్‌లో వచ్చే బాబీదేవోల్ సంభాషణలు, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తొలగించారట.



# ముద్దుగుమ్మ తీరుకు ఫ్యాన్స్ ఫిదా
## తాను చేసిన తప్పును సరిదిద్దుకున్న మృణాల్..

**టాకీస్:** అనడానికి ఏముంది? ఎవరైనా.. ఎప్పుడైనా నోరు జారి ఏదో ఒకటి అనేయవచ్చు. పొరపాటు దొర్లవచ్చు. కానీ తాను పొరపడ్డానని తెలుసుకుని దిద్దుకోవడంలోనే కదా ఉంటుంది గొప్పతనం. రీసెంట్‌గా బిపీసా విషయంలో జరిగిన ఓ పొరపాటును మృణాల్ దిద్దుకున్న తీరుకు ఫిదా అవుతున్నారు జనాలు. అప్పుడెప్పుడో నా 19 ఏళ్లప్పుడు చెప్పిన విషయం... ఇంత గాయపరుస్తుందని అనుకోలేదని అంటున్నారు మృణాల్. ఇంటర్వ్యూలో సరదాగా మృణాల్ అన్న మాటలు రీసెంట్‌గా దుమారం రేపాయి. బిపాసాను ఉద్దేశించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు బాడీ షేమింగ్‌గా ఉన్నాయంటూ నెటిజన్లు విరుచుకుపడ్డారు. మృణాల్ మాటలకు హర్ట్ అయిన బిపాసా కూడా ఇన్ డైరెక్ట్ గా రియాక్ట్ అయ్యారు. శారీరకంగా దృఢంగా ఉండటానికి మహిళలు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. బిపాసా స్పందించిన తీరు కూడా క్షణాల్లో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.

ఇప్పుడు దాని గురించే రియాక్ట్ అయ్యారు మృణాల్. చిన్నతనంలో తెలియక అలా మాట్లాడానని అన్నారు. ప్రతి కోణంలోనూ అందం ఉంటుందని నేనిప్పుడు నమ్ముతున్నా. ఏం మాట్లాడుతున్నానో అర్థం చేసుకోలేని ప్రాయం అది. చాలా దూరం వచ్చింది.. మనసుల్ని గాయం చేసింది. అందుకు డీప్లీ సారీ.. అంటూ మృణాల్ పోస్ట్ చేశారు. మెచ్యూరిటీ అంటే ఇదేనని మెచ్చుకుంటున్నారు ఫ్యాన్స్.

## బాహుబలి రీరిలీజ్ కోసం
# ఎదురుచూపు

**టాకీస్:** భారతీయ సినీ చరిత్రలో సెన్సేషన్ సృష్టించిన సినిమా 'బాహుబలి'. ఇప్పటికీ ఆ మ్యాజిక్, ఆ ఎమోషన్ ఎక్కడ తగ్గలేదు. ఇప్పుడు అదే బాహుబలి సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు భాగాలను కలిపి,



కొత్త సన్నివేశాలు జోడించి రూపొందించిన ఈ స్పెషల్ వెర్షన్‌కు పేరు - 'బాహుబలి ది ఎపిక్'. అక్టోబర్ 31న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై, అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభాస్, రానాలతో ఇప్పటికే ఒక స్పెషల్ ఇంటర్వ్యూ కూడా షూట్ చేసినట్లు- టాక్ ఉంది. అనుష్క కూడా పాల్గొనబోతుందన్న వార్తలు వినిపిస్తున్న, ఆ విషయాన్ని టీమ్ కన్ఫర్మ్ చేయలేదు. అక్టోబర్ రెండో వారం నుంచి పూర్తిగా బాహుబలి ప్రమోషన్లపై దృష్టి సారించనున్నాడు. ఇక నిర్మాత శోభు యార్లగడ్డ వరల్డ్ వైడ్ రిలీజ్ కోసం గ్రాండ్‌గా ప్లాన్స్ చేస్తున్నారట. ప్రీమియర్లతో మొదలయ్యే ఈ వేడుకలు అంతర్జాతీయ స్థాయిలో జరగనున్నాయి. ఒకవేళ ఈ 'సింగిల్ పార్ట్ ఎపిక్ ఫార్ములా' సక్సెస్ అయితే, భవిష్యత్తులో పుష్ప, కెజిఎఫ్ వంటి బ్లాక్‌బస్టర్లు కూడా ఇదే రూట్ ఫాలో అయ్యే ఛాన్స్ ఉంది.

కానీ ప్రస్తుతం అనుష్క హైదరాబాద్‌లో ఉన్నందున సెప్టెంబర్‌లో జరిగే ఈవెంట్స్‌లో ఆమె పాల్గొనడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. వీరితో పాటుగా రమ్యకృష్ణ, తమన్నా, సత్యరాజ్, సుదీప్, నాజర్ తదితర తారలతో కూడా వరుస స్పెషల్ ఈవెంట్లు-, ఇంటర్వ్యూలు ఎ÷-లాన్ చేస్తున్నట్లు- సమాచారం. ఈ మొత్తం షెడ్యూల్‌ను కార్తికేయ పర్యవేక్షణలో సిద్ధం చేసారని తెలుస్తోంది. ఇక ఈ బాహుబలి ఎపిక్ రిలీజ్ కోసం అభిమానుల్లో క్రేజ్ రోజురోజుకీ పెరుగుతోంది. సహజంగానే దీనికి భారీ ఓపెనింగ్స్ ఖాయమని టాక్ వినిపిస్తోంది. జక్కన్న రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబు సినిమా షూట్‌తో బిజీగా ఉన్నప్పటికీ,

# సోషల్ మీడియా కామెంట్స్ పట్టించుకోను
## పరదా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది

టాకీస్: సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోవడం మానేసినట్లు నటి అనుపమ పరమేశ్వరన్ కుండబద్దలు కొట్టారు. సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోను. నేను పరదా పోస్టర్స్ షేర్ చేసినప్పుడు కూడా కొందరు దీనికి నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. 'అట్టర్ ఫ్లాప్ అవుతుంది' అన్నారు. ఆ వ్యాఖ్యలు మా సినిమాను నిర్ణయించలేవు. ఒకవేళ నిజంగానే ఇది ప్రేక్షకాదరణ పొందలేకపోయినా.. నేను ఒక మంచి సినిమా తీశాననే సంతృప్తి నాకు జీవితమంతా ఉంటుంది. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన 'పరదా' ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె పంచుకున్నారు.

కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇలాంటి కామెంట్స్ విని బాధ పడేదాన్ని. అనుభవం వచ్చే కొద్దీ ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి. గతంలో ప్రతి పోస్ట్‌కు వచ్చిన కామెంట్స్ అన్నీ చదివేదాన్ని. ఇప్పుడు నేను చెప్పాలనుకున్న విషయం చెప్పేసి వదిలేస్తున్నా. ఎవరెన్ని మాటలన్నా మనం జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే అని అర్థం చేసుకున్నప్పుడు ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయన్నారు. టిల్లు స్క్వేర్ తర్వాత నేను మాట్లాడే విధానంలోనూ మార్పు వచ్చింది. ఆ సినిమా



విడుదలకు ముందు నాపై చాలా నెగెటివిటీ- వచ్చింది. రిలీజ్ అయ్యాక ప్రశంసలు వచ్చాయి. -ట్రైలర్ విడుదలయ్యాక నెగెటివిటీ- వస్తుందని తెలిసే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నాను. అలాంటి రోల్స్‌ను అంగీకరించడమే ఒక సవాలు. వాటిని ఓకే చేయాలంటే ధైర్యం కావాలి. ఆ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఎన్నో ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగారు. అలాంటి ప్రశ్నలు కేవలం మహిళలనే అడుగుతారు. హీరోలను ఎందుకు అడగరు?. వాళ్లకు వ్యూస్ రావడం కోసమే అలా ఇబ్బందికరమైన ప్రశ్నలు అడుగుతారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయానని తెలిపారు.

# ఫౌజీ నుంచి ప్రభాస్ లుక్ లీక్
## అలాంటివి షేర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**టాకీస్:** హను రాఘవపూడి, ప్రభాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న 'ఫౌజీ' సినిమా నుంచి ప్రభాస్ లుక్ లీకైంది. అందులో ఈ హీరో వింటేజ్ లుక్‌లో కనిపించడంతో అది క్షణాల్లో వైరలైంది. నెటిజన్లు దాన్ని తెగ షేర్ చేశారు. తాజాగా దీనిపై నిర్మాణ సంస్థ స్పందించింది. కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

ఈ సినిమా కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. చిత్రీకరణ సమయంలో సెట్స్ నుంచి ఓ ఫొటో బయటకు వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. మీకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని ఇచ్చేందుకు మేం నిరంతరం కృషి చేస్తున్నాం. ఇలాంటి లీక్‌లు మా టీమ్ నైతికతను దెబ్బతీస్తాయి. అనధికారికంగా ఎవరైనా ఈ సినిమా ఫొటోలు షేర్ చేస్తే వారి ఖాతాలను తొలగించడమే కాకుండా సైబర్ నేరంగా పరిగణిస్తాం. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇక 'ఫౌజీ' విషయానికొస్తే.. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోంది. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీ రానుంది. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి ఈ కథను సిద్ధం చేశారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.